## పాలు - నీళ్ళు

పెద్దవాళ్ళు దీవిస్తున్నప్పుడు పాలు - నీళ్ళలా కలిసి జీవించండని ఆశీర్వదించడం పరిపాటి. ఇది మంచి స్నేహితులకు గాని, జీవిత భాగస్వాములకు గాని, ఎవరికైనా వర్తిస్తుంది. అసలు ఈ ఉపమానం ఎలా స్థిరపడిందనే విషయాన్ని ఓ శాస్త్రవేత్త ఇలా వివరించారు. పాలు, నీళ్ళు చాలా మంచి మిత్రులు. పాలను వేడి చేసినప్పుడు, దానితో కలసివున్న నీరు (పాల ప్రాణమిత్రుడు) ఆవిరి రూపంలో బయటికి పోతుంది. పాలు నీటి (తన ప్రాణమిత్రుని) వియోగాన్ని భరించలేక ఆత్మాహుతి చేసుకొనేటందులకు దు:ఖముతో పొంగుతుంది. అయితే అప్పుడు ఆ పాలల్లో నీళ్ళు కొద్దిగా చిలకరిస్తే (తన ప్రాణ స్నేహితుడు తిరిగి తనను చేరినందుకు) ఆనందముతో తన ఆవేశాన్ని తగ్గించి పూర్వ స్థితిని పొందుతుందని ఆయన ఉవాచ. మీరేమంటారు?

## పుటుక్కు-జరజర-డుబుక్కు-మే

దీని భావమేమి దీవరేణ్య? అంటే ... అనగా అనగా ఒక ఊరిలో ఒక ఇల్లు ఉంది. దానికి నలుప్రక్కలా పెంకులతో ఏటవాలు ఇంటి కప్పు, మధ్యలో చావడి ఉన్నాయి. ఆ పెంకులపై ఒక గుమ్మడి పాదు వ్యాపించి ఉంది. దానికి బోలెడు గుమ్మడి కాయలు ఉన్నాయి. ఆ ఇంటి కప్పుని స్థావరముగా చేసుకొని ఓ ఎలుక నివసించ సాగింది. చావడిలో ఓ మేకపిల్ల గడ్డిమేస్తూ ఉంది. ఇంతలో ఆ ఎలుక ఓ గుమ్మడి కాయను చూసి ముదమున పుటుక్కున కొరికింది. ఆ గుమ్మడి కాయ జర జరా జారుతూ, డుబుక్కున గడ్డి మేస్తున్న మేకపై పడింది. వెంటనే మేక మే అని అరిచిందిట. ఇదీ పుటుక్కు-జరజర-డుబుక్కు-మే కథ.

## ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం

నిజానికిది 'ఆలీ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం' అని ఉండాలి. కాని వాడుకలో 'ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం' అయిపోయింది. ఈ సామెత ఎలా వచ్చిందంతే ...

పూర్వం ఒక ఊరిలో రామలింగం అనే ఓ సోమరి ఊండేవాడు. కాణీ సంపాదన లేకపోయినా ఆలోచనలు నక్షత్ర మండలాన్ని దాటి పొయేవి. ఒకసారి అతను అలా వెల్తుంటే, ఓ అర్ధణా నాణెం దొరికింది. దాన్ని తీసుకుని రామలింగం ఆలోచించడం మొదలుపెట్టాడు. దానితో వ్యాపారం చెయ్యాలని, బోలెడు డబ్బు సంపాదించాలని పథకం వేసాడు. వెంటనే ఆ డబ్బుతో పేల పిండి కొన్నాడు. ఆ పిండిని పట్టుకుని వెల్తూ ఓ మర్రి చెట్టును చూసేసరికి ఎక్కడలేని అలసటా వచ్చేసింది. బద్ధకస్తునికి నిద్ర వేళకానివేళైనా వద్దన్నా వస్తుంది. ఒక్క ఘుడియ విశ్రమించి వెల్దామని ఆ మర్రి చెట్టు నీడన శయనించాడు.

ఆ పేలపిండిని అమ్మి, వచ్చిన డబ్బుతో వేరు శనగ పప్పు (పల్లీ) కొని, అక్కడ ఇక్కడ పోగేసిన కట్టెలతో వాటిని కాల్చి అమ్మగా మరికొంత లాభం వచ్చింది. మెల్లగా వేరు శనగ పప్పు నుండి వ్యాపారం వృద్ధి చెంది చిన్న కిరానా కొట్టు పెట్టాడు. క్రమంగా లాభాలను ఆర్జించి, బట్టల దుఖాణము, పాలు, పెరుగు, నెయ్యి లాంటి వ్యాపారాలు, ఇదీ అదీ అని చూడకుండా అన్ని రకాల వ్యాపారాలు చేయనారంభించాడు. ఓ ఇంటివాడు, ఆ తరువాత ఓ ఇంతివాడు (పెళ్ళి చేసుకోవడమన్నమాట!) అయ్యాడు. అందమైన భార్యతో కొన్నాళ్ళు విహారయాత్రలు సాగించాడు. తన వ్యాపారాభివృద్ధికి వారసుడొకడు అవసరమని తలంచి భార్యతో సంప్రదించాడు. కొన్నాళ్ళకు భార్య గర్భము దాల్చింది. వారికి ఒక అబ్బాయి పుట్టాడు, ఆ అబ్బాయికి పేరు పెట్టావలసిన సమయం ఆసన్నమైనది. రామలింగం కుమారునికి సోమలింగం అని తన తండ్రి పేరు పెట్టాలని, అతని భార్య వాళ్ళ నాన్న పేరు పెట్టాలని వాదించుకొన్నారు. ఇలా వాదన ముదిరి చివరకు ఆగ్రహావేశంతో 'ఏమే! నా మాటకే ఎదురు చెప్తావా?' అని కాలితో ఓ తాపు తన్నాడు. అంతే పేలపిండితోనున్న కుండ కాస్తా ముక్కలై పిండి నేలపాలైంది - రామలింగం కల చెదరి ఈ లోకంలోకి వచ్చాడు.

అందుకే ఏమీ ప్రయత్నం లేకుండా గాలిలో మేడలు కట్టే వారిని చూసి 'ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం ' అనడం సాధారణం.